క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని నాయకులగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు, పోషణమాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ హాజరై మాట్లాడారు. చిన్నారులకు ఆట పాటలతో విద్యాబోధన చేయాలన్నారు. పోషకాహారం అందించాలన్నారు. హెడ్మాస్టర్ సూర్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు గంగాభవాని, మీనాకుమారి, కృష్ణకుమారి, రాజేశ్వరి, సరస్వతి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



వెంకటాపురం(కె): ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై అశోక్ తెలిపారు. మండలం పరిధిలోని చొక్కాల గ్రామ శివారులో ఎస్సై బుధవారం వాహనాలు తనిఖీ చేసి గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. వాహనంపై ముగ్గురు ప్రయాణించడం నేరమన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

పరామర్శ



వాజేడు: మండలంలోని కొప్పుసూరు గ్రామానికి చెందిన ఏఎన్ఎం సాధనపల్లి రజినీ ఇటీవల డెంగీ జ్వరంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని వాజేడు, వెంకటాపురం (కె) ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు బుధవారం పరామర్శించి రూ.5000 ఆర్థిక సాయంగా అందజేశారు.

వాహనాల తనిఖీ



వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్‌లో బుధవారం పోలీసులు 163 నెంబర్ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని సోదాలు చేశారు. వాహనాల్లోని బ్యాగులను తనిఖీ చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా కృష్ణవేణి దరఖాస్తు



ములుగు రూరల్ : బీజేపీ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి నాయక్ దరఖాస్తు చేసుకుంది. బుధవారం పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులతో కలిసి ముందుగా గట్టమ్మ తల్లికి ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో దరఖాస్తు నమోదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను వందశాతం అమలు చేశానని అన్నారు. ఆమె వెంట మండల విజయ్‌కుమార్, ఏనుగు రవీందర్‌రెడ్డి, సాంబశివరెడ్డి, స్వప్న, సురేష్, వెంకటరమణ, తిరుపతిరెడ్డి, రాజ్‌కుమార్, మాదగిరిగౌడ్, తిరుపతి, వీరేందర్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక పూజలు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, నాయకులు మేకల భిక్షపతి, భూతం నర్సయ్య, దేవేందర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

● ములుగు ఎమ్మెల్యే సీతక్క

ములుగు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం అని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. కన్నాయిగూడెం మండలంలోని సర్వాయి, చిట్యాల గ్రామ సర్పంచ్ ఆలం శారద చిరంజీవి, వార్డు సభ్యులు సోయం లక్ష్మయ్య, ఆలం వెంకటేష్, సుధాకర్, జయరాజు, మహేష్, రాఘవులు, శైలజ, స్వర్ణలత పార్టీలోకి చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో నిరుపేదలకు ఎలాంటి సహాయం అందలేదన్నారు. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని ఆశించిన వారిని సీఎం కేసీఆర్ నట్టేటా ముంచారని ఆరోపించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వస్తున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా ఆదుకుంటా మన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్పంచ్ శారదకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

మంత్రి సత్యవతి రాథోడ్‌కు ధన్యవాదాలు

ములుగు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఎమ్మెల్యే సీతక్క ధన్యవాదాలు తెలిపారు. మంజూరైన నిధులతో వెంటనే పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

అన్ని వర్గాలకు అండ సీఎం కేసీఆర్

● జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ములుగు: సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.2.51 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోరిక విజయరాంనాయక్, ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, ఆత్మచైర్మన్ చక్రపాణి, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, యువజన నాయకుడు బైకాని సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

ములుగు నియోజకవర్గ అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ ద్వారా రూ. 56 కోట్లు కేటాయించడంపై ఎమ్మెల్యే నాగజ్యోతి సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో లింక్‌రోడ్లు, రవాణా వ్యవస్థ అభివృద్ధికి సహకారంగా ఉంటుందని అన్నారు. సహకరించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సత్యవతి రాథోడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్‌గా నర్సింహారావు



కన్నాయిగూడెం: కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా గాందెర్ల నర్సింహారావును బుధవారం ములుగు ఎమ్మెల్యే సీతక్క నియమించింది. గత కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియా పోస్టు ఖాళీగా ఉండడంతో అధినాయకత్వం ఆదేశాలతో నేడు నియమిస్తూ నియామకపత్రాన్ని క్యాంప్ కార్యాలయంలో అందించారు. అనంతరం మండల పరిధిలోని సర్వాయి గ్రామపంచాయతీ సర్పంచ్ శారద భర్త చిరంజీవి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరి వెంట మండల అధ్యక్షుడు ఎండీ.అప్సర్ పాషా, ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, అరుణ్, జనగం వెంకటయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సునార్కని రాంబాబు, మండల యూత్ నాయకులు దుర్గం ప్రభాకర్, సర్వాయి ఉప సర్పంచ్ జంపయ్య, తదితరులు ఉన్నారు.

సమాచారం గోప్యంగా ఉంచుకోవాలి

ములుగు: సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో బాలికలు వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు తెలియకుండా గోప్యంగా ఉంచుకోవాలని షీ టీం బృందం సూచించింది. బుధవారం జిల్లా కేంద్రంలోని బ్రిలియంట్ స్కూల్ ఆవరణలో బాలికలకు అవగాహన కల్పించారు. కొంత మంది మార్ఫింగ్ ఫొటోలతో బాలికలు, యువతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారని, బ్లాక్ మెయిల్ చేస్తున్నారనే విషయం ఇటీవల ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయని తెలిపింది. హ్యూమన్ ట్రాఫికింగ్, బాల్యవివాహాలు వంటివి చట్టవ్యతిరేకం అని అన్నారు. సహాయానికి డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ యాదగిరి, హెడ్‌కానిస్టేబుల్ రామయ్య, మధు, మహిళా కానిస్టేబుల్ చైతన్య, పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం బృందం

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

భూపాలపల్లి అర్బన్: గణపురం మండలం కేంద్రంలోని వడ్డెర సంఘానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రవి, మండల అధ్యక్షుడు శివరాత్రి సారయ్య, కుల పెద్దమనిషి దండుగుల రవీందర్, మరో 50 మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ పేదల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ శాఖ మార్కెట్ చైర్మన్ పొలుసాని లక్ష్మీనరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణ చందర్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

నేడు చెక్కుల పంపిణీ

మల్హర్ : మండలం కేంద్రం తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 50 కల్యాణలక్ష్మి చెక్కులు జారీ అయినట్లు తహసీల్దార్ తెలిపారు.

నిధుల కేటాయింపుపై హర్షం



టపాసులు కాల్చుతున్న గ్రామస్తులు



పంబాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు

భూపాలపల్లి రూరల్: మండలంలోని అటవీ గ్రామాలకు రోడ్లు తదితర మౌలిక వసతుల కోసం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నిధులు కేటాయించినందుకు నాగారం గ్రామ ప్రజలు బుధవారం గ్రామంలో టపాసులు కాల్చుతూ.. హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జ్యోతి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగేడు పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాంపల్లి శ్రీనివాస్, నాగారం గ్రామ ఉప సర్పంచ్ మల్లేష్, ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ భూతం తిరుపతి, పార్టీ నాయకులు చేకూరి రాజు, జోగ్యా నాయక్, నరేందర్, కుమార్, వెంకన్న, కొండ భాస్కర్, లక్ష్మణ్, క్రాంతి, రాజు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాల్లో రోడ్లతో పాటు, మౌలిక సదుపాయల కల్పనకు నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు.. సర్పంచ్ బంటు అనూష రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. మండలంలోని అటవీ గ్రామాలైనా రాంపూర్ నుంచి చికినపల్లి వరకు బీటీ రోడ్డు, రాజీవ్‌నగర్ నుంచి పంబాపూర్ వరకు, దూదేకులపల్లి నుంచి ధోనికెళ్ల మడుగు వరకు, నాగారం నుంచి మీనాజీపేట, గొర్లబుద్దారం తండా నుంచి రాజు నాయక్‌తండా వరకు బీటీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేసినట్లు సర్పంచ్ బంటు అనూష రమేష్ తెలిపారు. ఎంపీటీసీ దార ప్రశాంత వెంకన్న, ఉపసర్పంచ్ సమ్మయ్య, సాదం వెంకన్న, రాజు, రామచంద్రు, అనిల్, వెంకన్న, యూత్ కమిటీ నాయకులు రాజు, సుందర్, క్రాంతి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి



ఈవీఎం ద్వారా అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ

చిట్యాల: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని భూపాలపల్లి ఆర్డీఓ కె.రమాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎలక్ట్రోల్ మొబైల్ వాహనంలో ఈవీఎం, బ్యాలెట్ బాక్స్ ద్వారా ఓటు వినియోగించుకునేందుకు రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రచారం రథంతో ప్రతి గ్రామంలో తిరుగుతూ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో మా సిబ్బందిచే అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో బీఎల్ఓలకు, సూపర్‌వైజర్లకు, ఓటర్ నమోదు కార్యక్రమంపై పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమన్, డీటీ శివతేజ్, ఆర్ఐ రాజు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



మహాముత్తారం: వర్షాకాలం కావడంతో గ్రామంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలో భాగంగా దోమల నివారణకు మండలంలోని మాదారం గ్రామంలో సర్పంచ్ అజీమా బేగం ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది బుధవారం ఫాగింగ్ చేపట్టారు. ఫాగింగ్ మిషన్ ద్వారా గ్రామంలోని వివిధ వార్డుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

వెంకటాపురం(కె): గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని, బాలింతలు పిల్లలకు ముర్రుపాలు తాగించాలని నూగూరువల్లె దవాఖాన వైద్యురాలు భవ్యశ్రీ అన్నారు. బుధవారం ఆస్పత్రిలో చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో ఎదిర డాక్టర్ భవ్యశ్రీ సహకారంతో గర్భిణుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చెడెం రవికుమార్, నూ గూ రు సర్పంచ్, డాక్టర్ భవ్యశ్రీ మాట్లాడుతూ గర్భిణీలు డెలివరీ సమయంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి అందరూ తప్పకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చెప్పడం జరిగింది. కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాష్, సాయితేజ, పంజ శశి కుమార్, ఏడుకొండలు, వినోద్ ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారిణి భవ్యశ్రీ

'సింహగర్జన' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ములుగు రూరల్: హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఈ నెల 10న నిర్వహించతలపెట్టిన బీసీల సింహగర్జన సభను విజయవంతం చేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి తెలిపారు. బుధవారం గోవిందరావుపేట మండలకేంద్రంలో సింహగర్జన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు అసెంబ్లీ ఎన్నికల్లో 60 సీట్లను కేటాయించాలని అన్నారు. రాజ్యాధికారంలో వాటా దక్కకుండా చేస్తున్న అగ్రకులాల కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. బీసీలు అధిక సంఖ్యలో హాజరై సింహగర్జన సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, బ్రహ్మాచారి, సైదులు, సురేందర్, మల్లయ్య, ప్రసాద్, రవింద్రాచారి పాల్గొన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

వెంకటాపురం(కె): పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో 10/10 సాధించాలని ఏటీడీఓ దేశిరాం అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఏజీహెచ్ఎస్ చిరుతపల్లి-2 పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ప్రభుత్వం అందించిన డైరీలు, నోటు బుక్స్, ఇతర సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక బోధన చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. మెనూ పాటిస్తూ భోజనం వడ్డించాలన్నారు. హెచ్ఎం నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న ఏటీడీఓ దేశిరాం

జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● వాజేడు వైద్యాధికారి మధుకర్

వాజేడు: జ్వరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వాజేడు వైద్యాధికారి మధుకర్ అన్నారు. మండల పరిధిలోని కొప్పుసూరు, గణపురం, మొట్లగూడెం గ్రామల్లో బుధవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జ్వరాల తీవ్రత పెరుగుతున్న క్రమంలో జ్వరం బారిన పడిన ప్రతి ఒక్కరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు విధిగా రావాలన్నారు. ఆస్పత్రుల్లో పలు రకాల పరీక్షలు నిర్వహించి సరైన వైద్యం చేయనున్నట్లు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే కాల్వలు తీసి తొలగించుకోవాలని తెలిపారు. తప్పనిసరిగా దోమతెరలు వాడాలని సూచించారు. ఆయన వెంట కోటిరెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి



రక్త సమూనాలను తీస్తూ..

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



పరామర్శిస్తున్న సత్యనారాయణరావు

చిట్యాల: పిడుగుపాటుకు గురై మృతి చెందిన చిలువేరి సరిత, నేర్పాటి మమతల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని పీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సివిల్ ఆస్పత్రి వద్ద పోస్టుమార్టం గదిలో ఉన్న మృతదేహాలకు ఆయన నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాల వైపు స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ కనీసం చూడకుండా ఉండడం అన్యాయమన్నారు. పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అలాగే గుంటూరుపల్లి గ్రామంలో మృతి చెందిన మన్నెం సుబ్బమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి కొమురయ్య, ఎంపీటీసీ దబ్బెట అనిల్, జిల్లా, మండల నాయకులు మధు వంశీకృష్ణ, దొడ్డి కిష్టయ్య, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మక్కెన కార్తీక్, సాంబశివరావు, శ్రీనివాస్, కుమార్, మల్లేష్, మార్కెండయా, శివ రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

అసత్యపు ఆరోపణలు మానుకోవాలి

మల్హర్: పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుపై కాటారం పీఏసీఎస్ చైర్మన్ నారాయణరెడ్డి అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో పార్టీ నిర్వహించిన పలు సమావేశాల్లో పార్టీ టికెట్ ఎవరికి కేటాయించిన గెలిపిస్తాం, గెలిపించే బాధ్యత నాది అని నారాయణరెడ్డి ప్రగాల్బాలు పలికాడని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చడానికే ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నాడని ఆరోపించారు. ఇకపై ఇలాంటివి మానుకోకపోతే అధిష్టానానికి ఫిర్యాదు చేసి పార్టీ నుంచి బయటకు పంపాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాశ్‌రావు, రైతుబంధు మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, మండల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు